
ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రమేష్ బాబుతో బీఆర్ఎస్ నాయకులు

ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ

- చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్

ముషీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ అన్నారు. షబ్-ఏ-బరాత్ పండుగను పురస్కరించుకుని భోలక్‌పూర్ బడీ మసీద్, బిలాల్ మసీద్ తదితర మసీదుల వద్ద బందోబస్తు నిర్వహించిన ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రమేష్ బాబు, ఎస్సై ప్రేమ్ కుమార్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లాక్ హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పండుగలను జరుపుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నూర్ ఉల్ హుస్సేన్, అల్లాఉద్దీన్, జఫీర్ ఉద్దీన్, ఎగ్బాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


రూమ్‌లను ప్రారంభిస్తున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ధనుంజయ్

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జి.ధనుంజయ్ పిలుపునిచ్చారు. విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతామని అన్నారు. శనివారం కాచిగూడ వైశ్యహాస్టల్‌లో రీనోవైస్డ్ డీలక్స్ రూమ్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టుదలతో విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కూర రఘువీర్, వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పాల రాజేశ్వర్, పి.రాజేశ్వర్‌రావు, జి.చంద్రయ్య, కె.భాస్కర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను పూర్తిచేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను పూర్తిచేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. ప్యాచ్‌వర్క్ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శనివారం డివిజన్‌లోని లింగంపల్లి, కుర్మబస్తీ, బాలప్పబాడ తదితర ప్రాంతాలలో పాదయాత్ర చేసి గుంతల రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు బల్వీర్, కృష్ణకుమార్, క్షీరసాగర్, అరవింద్, బి. భీమ్ రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసమే ఇన్‌చార్జిల నియామకం : టీడీపీ

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంవత్సర కాలం పదవులు ఇప్పిస్తానంటూ నాయకులు, కార్యకర్తల కడుపు కొట్టడంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులను కాంగ్రెస్ అధిష్టానానికి అప్పజెప్పడానికేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. శనివారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నూతన ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వల్ల రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదన్నారు. రాష్ట్రాన్ని పునరావాస కేంద్రంగా మార్చుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమైనా ఉందంటే సంవత్సర కాలంలో లక్షా డెబ్బైవేల కోట్ల అప్పు మాత్రమేనన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని రాష్ట్ర ప్రజల బాగు కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచార జాతుల ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. తమ సమస్యలను పరిష్కరించే వరకూ వివిధ రూపాల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, రసూల్, ఇమామ్, రషీద్, అలీ అబ్బాస్, కమల్, గౌస్, నాగుల్ మీర గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ హ్యాక్.. స్క్రీన్ బ్లాక్ చేసి రూ.1.43 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్

- కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినందుకు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికిన బాధితుడు.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. అతడిని మాటలతో మాయచేసిన క్రిమినల్స్ మోసపూరిత లింక్‌లు పంపి ఫోన్ హ్యాక్ చేసి రూ. 1.43 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 399 డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లు చూస్తే 'కుకు ఎఫ్ఎమ్' సబ్‌స్క్రైబ్ నిమిత్తం డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో ఎలాగైనా డబ్బులు డెబిట్ కాకుండా ఆపేయాలని, 'కుకు ఎఫ్ఎమ్' కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అప్పుడు అతడికి ఒక నంబర్ కనిపించింది. వారికి ఫోన్ చేసి తన సబ్‌స్క్రైబ్‌ను తొలగించాలని కోరాడు. అందుకు అవతలి వ్యక్తి స్పందిస్తూ.. ఏ బ్యాంక్ నుంచి డబ్బులు డెబిట్ అవుతున్నాయో ఖాతా వివరాలు ఇవ్వండి అని చెప్పాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత ఒక లింక్‌ను పంపి ఓపెన్ చేసి, మీ ఖాతా నుంచి రూ.1 ట్రాన్స్‌ఫర్ చేయండి ఆ తర్వాత మేము లావాదేవీలు అన్నీ ఆపేస్తామని హామీ ఇచ్చాడు. అందుకు సంబంధించిన ప్రాసెస్ అంతా వీడియోకాల్ చేసి చూపించాడు. బాధితుడు వారు చెప్పినట్లు చేశారు. తన ఖాతా నుంచి రూ. 1 డెబిట్ అయిన వెంటనే బాధితుడి ఫోన్ స్క్రీన్ బ్లాక్ అయింది. ఫోన్ ఆన్‌లోనే ఉండడంతో బాధితుడు తన స్క్రీన్ బ్లాక్ అయిన విషయాన్ని చెప్పగా.. కంగారు పడొద్దు. కొద్దిసేపు అలాగే అవుతుంది. కాసేపట్లో ప్రాసెస్ అయిపోతుందని నమ్మించాడు. ఆ తర్వాత ఫోన్‌లో ఎవరూ స్పందించలేదు. బాధితుడు అయోమయానికి గురయ్యాడు. సుమారు 40 నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ స్క్రీన్ ఆన్ అయింది. ఆ తర్వాత వెంటవెంటనే బ్యాంకు మెసేజ్‌లు రావడాన్ని గుర్తించి చెక్ చేయగా.. తన ఖాతా నుంచి మొత్తం రూ. 1,43,212 డెబిట్ అయినట్లు తేలింది. దాంతో హుటాహుటిన బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా.. మీరు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడంతో వారు మీ ఖాతాలో డబ్బులు దోచేశారని చెప్పారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపయోగంగా ఎన్‌టీఆర్ స్టేడియం

- చెత్త, మట్టికుప్పలకు నిలయంగా మైదానం
- వాహనాల అక్రమ పార్కింగ్..
- పట్టించుకోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు


ఎన్‌టీఆర్ స్టేడియంలో వాహనాల అక్రమ పార్కింగ్

కవాడిగూడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, తెలంగాణ సాంస్కృతిక శాఖ అధికారుల సమన్వయ లోపంతో ఎన్‌టీఆర్ స్టేడియం చెత్తకుప్పలు, మట్టికుప్పలతో దర్శనమిస్తూ నిరుపయోగంగా మారింది. క్రీడలను ప్రోత్సహిస్తున్నామని పదేపదే చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం నగరం నడిబొడ్డున ఉన్న ఎన్‌టీఆర్ స్టేడియం నిరుపయోగంగా మారితే ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు క్రీడాకారులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం కేంద్రంలో బీజేపీ, ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం నారాచంద్రబాబు ఎన్‌టీఆర్‌స్టేడియం ఏర్పాటుచేశారు. వేసవి సెలవులు, ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో నగర వ్యాప్తంగా ఉన్న క్రికెట్ క్రీడాకారులు ఎన్‌టీఆర్ స్టేడియానికి వచ్చి క్రీడల్లో ప్రాక్టీస్ పొందుతూ వస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఎన్‌టీఆర్ స్టేడియంలో తెలంగాణ కళాభారతి నిర్మిస్తామని చెప్పి, ఈ స్టేడియాన్ని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులకు అప్పగించారు. అయితే నాటి నుంచి నేటి వరకు ఎన్‌టీఆర్‌స్టేడియంలో ఎవరూ సెక్యూరిటీ సిబ్బంది లేకుండాపోయారు. గతంలో జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉన్న సమయంలో ఎన్‌టీఆర్ స్టేడియానికి ఉన్న ఆరు ప్రధాన గేట్ల వద్ద జీహెచ్ఎంసీ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించేవారు. సమయం దాటిన తరువాత స్టేడియంలోకి ఎవరిని కూడా అనుమతించే వారు కాదు. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత నాటి సీఎం కేసీఆర్ ఎన్‌టీఆర్ స్టేడియంలో తెలంగాణ భారతి నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో ఎన్‌టీఆర్ స్టేడియంలో విధులు నిర్వహించిన జీహెచ్ఎంసీ సిబ్బంది తప్పించుకున్నారు. దీంతో స్టేడియం చెత్తకుప్పలు, మట్టికుప్పలకు, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. దీనికితోడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల విజయోత్సవానికి కేసీఆర్ మీటింగ్‌కు వస్తున్న సందర్భంగా అప్పటి అధికారులు ఎన్‌టీఆర్ స్టేడియం చుట్టూ ఉన్న ప్రహరీని ఐదుచోట్ల కూల్చివేశారు. అయితే మీటింగ్ తర్వాత ఆ గోడలను పునర్ నిర్మించకపోవడంతో ఎన్‌టీర్ స్టేడియంలో అక్రమ పార్కింగ్‌లు, జులాయిలు రాత్రి సమయాల్లో చొరబడి నిత్యం గొడవలు చేస్తూ ఇబ్బందులకు పాల్పడుతున్నారు.


అదనంగా ఏర్పాటు చేసిన గేటు వద్ద పేరుకుపోయిన చెత్త, లారీల పార్కింగ్

స్టేడియాన్ని పరిరక్షించాలి



క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని పదేపదే చెబుతున్న ప్రభుత్వం ఎన్‌టీఆర్ స్టేడియాన్ని పట్టించుకోవడం లేదు. క్రీడాకారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. వెంటనే ఎన్‌టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను తొలగించాలి. అక్రమ పార్కింగ్ జరగకుండా చర్యలు తీసుకుని, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

- మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ నివాసి

ఈ స్టేడియంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, బుక్‌ఫేయిర్‌లు నిర్వహించినప్పటికీ మిగతా సమయంలో స్టేడియంలో ఎలాంటి సెక్యూరిటీ సిబ్బంది ఉండడం లేదు. దీంతో మైదానంలో వాహనాలు పార్కింగ్ చేయడం, వాహనాల్లో మద్యం తాగి గొడవలు సృష్టించడం, కొంత మంది యువకులు రాత్రి సమయాల్లో గంజాయి తాగి, ఎన్‌టీఆర్ స్టేడియంలోకి వచ్చిన వారితో గొడవలకు దిగుతుండడం సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సాంస్కృతిక శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఎన్‌టీఆర్ స్టేడియంలో మట్టి కుప్పలు, చెత్తకుప్పలు వేసే వారు, ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని, స్టేడియానికి సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ స్టేడియంలో రాత్రిసమయాల్లో తిష్టేసి గంజాయి తాగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలం చెందుతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఎన్‌టీఆర్ స్టేడియంలో పెట్రోలింగ్ పెంచి, ఆవారాలు. గంజాయిబ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్టవేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం

ఎన్‌టీఆర్ స్టేడియంలో అడుగడుగునా యంత్రాంగం నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వాహనాల అక్రమ పార్కింగ్, చెత్త, మట్టికుప్పలను డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్‌టీఆర్ స్టేడియం క్రీడాకారులకు ఉపయోగపడడం లేదని సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగరం నడిబొడ్డున ఉన్న ఎన్‌టీఆర్ స్టేడియాన్ని పరిరక్షించాలని, క్రీడాకారులు శిక్షణ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రంగరాజ్‌గౌడ్ మృతి బీజేపీకి తీరని లోటు

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ


రంగరాజ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దత్తాత్రేయ

కవాడిగూడ, , ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పేద ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేయడంతో పాటు బీజేపీ పటిష్టతకు అహర్నిషలు పాటిపడిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగరాజ్‌గౌడ్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని హరియాణా గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ కొనియాడారు. పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి అంచలంచెలుగా ఎదిగారన్నారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో నివాసం ఉండే రంగరాజ్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ విషయాన్ని తెలుసుకున్న దత్తాత్రేయ శనివారం కవాడిగూడ తాళ్లబస్తీలోని ఆయన నివాసంలో రంగరాజ్‌గౌడ్ కుటుంబసభ్యులను కలిసి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్ట కాలంలో ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. రంగరాజ్‌గౌడ్ కుటుంబానికి పార్టీతోపాటు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్లు టి.ఇందిర, టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పూస రాజు. పరిమళ్‌కుమార్, బీజేపీ నగర నాయకులు ఎంసీ.మహేందర్‌బాబు, బీజేపీ నేతలు సికె శంకర్‌రావు. మద్దెల చంద్రయ్యగౌడ్, సురేష్‌ముదిరాజ్, జమాల్‌పూరి నందు, ప్రవీణ్‌గౌడ్, రంగరాజ్‌గౌడ్ తనయుడు సంపత్‌కుమార్‌గౌడ్, ఆయన సోదరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదానికి గురైన బీజేపీ నగర నాయకుడు రాగం రవికుమార్‌ను కూడా దత్తాత్రేయ ఆయన నివాసంలో పరామర్శించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి బీజేపీ శ్రేణులు కృషి చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం బీజేపీ శ్రేణులు కృషి చేయాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సి.సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో శనివారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో దత్తాత్రేయను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ఎంసీ.మోహన్, శేషసాయి, కౌండిన్య ప్రసాద్, ఓంప్రకాష్, బాబు, బాల్‌రాజ్, వంశీ, జగదీష్‌గుప్తా, కె.రామారావు, చంద్రశేఖర్, ప్రదీప్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

15.950 కిలోల గంజాయి స్వాధీనం

(5వ పేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని గుట్టుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన సరఫరాదారులకు సరుకును అందజేయడంతో వారు రైల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన స్మగ్లర్స్ సికింద్రాబాద్ వరకు సరుకును తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్, ధనుంజయకు శనివారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు బృందం రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి స్మగ్లర్స్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ అభినందించారు.

చిక్కడపల్లిలో 8 మంది

చిక్కడపల్లి: గంజాయి త్రాగడానికి గుమిగూడడంతోపాటు గంజాయి బేరాలు చేస్తున్న 8 మందిని శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్ బస్ భవన్ ఎదురు వీధిలో రిసాలకు చెందిన మహ్మద్ సిద్దిక్‌ఖాన్(25), మహ్మద్ నాసిర్(20), మహ్మద్ సైఫ్(20), రామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్(25), బేగంపేటకు చెందిన పీక జతిన్(21), పీక ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్(21), తిరుమలగిరికి చెందిన ఎస్ విష్ణు(26)లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంతోకలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా వీరిలో అయిదుగిరిని కోర్టులో ప్రవేశ పెట్టామని మిగతా ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వారివద్దనుంచి 300 గ్రాముల గంజాయి, 12270 రూపాయలు, 2 బైక్‌లు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి , డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినచర్యలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ హెచ్చరించారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

హైదర్‌నగర్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోహెల్ కేపీహెచ్‌బీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసిపట్టుకున్నారు. అతని వద్ద నుంచి 650గ్రాముల డ్రై గంజాయి, 20ఎంఎల్ హష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని ఎస్ఓటీ పోలీసులు అతనిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెయిల్‌పై విడుదలై పరారీలో..

- తప్పించుకు తిరుగుతున్న రౌడీషీటర్ల అరెస్ట్

హైదరాబాద్‌సిటీ: బెయిల్‌పై విడుదలపై పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట, మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లలో 18 చోరీ, దాడి కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ అల్‌బదూర్ అలియాస్ హబీబ్ తల్హ బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పలు పోలీస్టేషన్‌ల పరిధిలో 7 నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ కె. ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నుపై రౌడీషీటర్ భక్తియాస్ ఖురేషీ హత్యకేసుతోపాటు ఎన్‌డీపీఎస్, ఆర్మ్స్ యాక్ట్ వంటి 11 కేసులున్నాయి. గంజాయి కేసులో 2024 ఆగస్టులో ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతడిపై 2 నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వీరిద్దరూ మాదన్నపేటలో ఉన్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఇద్దరినీ ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీనివాసరావు తెలిపారు.

అట్టహాసంగా భరత్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవ ర్యాలీ


ప్రమాణ స్వీకారోత్సవానికి చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరిన బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ పార్టీ నేతలు

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ శనివారం అట్టహాసంగా పదవీ బాధ్యతల స్వీకారం చేశారు. ఇందులో భాగంగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం చౌరస్తా నుంచి చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, ఇందిరాపార్కు, దోమలగూడ చౌరస్తా, ముషీరాబాద్, గాంధీ ఆస్పత్రి నుంచి ముషీరాబాద్‌లోని కపీష్ ఫంక్షన్‌హాల్ వరకు వందలాది నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రథంలో భరత్‌గౌడ్ ముందుకు సాగగా కార్యకర్తలు నడిచారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్, జి.రచనశ్రీ, కె.రవిచారి, బీజేపీ నాయకులు పూస రాజు, మేకల సారంగపాణి, మద్దూరి శివాజీ, కిరణ్, సాయికృష్ణయాదవ్, రాంరెడ్డి, పార్థసారథి, జైపాల్‌రెడ్డి, నరేష్, జి.వెంకటేష్, పి.ఎన్.చారి, మహేష్, శక్తిసింగ్, గడ్డం నవీన్‌తో పాటు అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ మహిళా నేతలు మంగళహారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ పొడవున బాణా సంచాలు కాల్చారు. ఈ ర్యాలీ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా బీజేపీ నేతల కటౌట్‌లు ఏర్పాటు చేసి భరత్‌గౌడ్‌కు బీజేపీ నేతలు స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. ర్యాలీ అనంతరం ముషీరాబాద్‌లోని కపీష్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో భరత్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి మూడు దశాబ్దాలుగా తాను అందించిన సేవలకు గుర్తించి ఈ పదవి కల్పించడం ఆనందంగా ఉందన్నారు.

సంత్‌సేవాలాల్ బోధనలను అందరూ ఆచరించాలి



జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి, పద్మజ, చంద్రకళ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్‌సేవాల్ మహరాజ్ బోధనలు అందరూ ఆచరించాలని ఆయన చూపిన బాటలో నడుచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. సేవాలాల్ విద్యార్థి సేన ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆవరణలో సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసీరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ తదితరులు హాజరై, సంత్‌సేవాల్ సేవలను కొనియాడారు. అన్నదానం నిర్వహించారు. గ్రంథాలయ శాఖ గ్రేడ్-1 లైబ్రేరియన్ చంద్రకళ, సేవాలాల్ విద్యార్థి సేన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, లంబాడీస్(బంజారాల) ఐక్యవేదిక అధ్యక్షుడు డా.రాజ్‌కుమార్ జాదవ్, దీని మిషన్ వ్యవస్థాపకుడు, సీఐ ఏడుకొండలు, గవర్నమెంట్ టీచర్ రావులు భాస్కర్, సేవాలాల్ విద్యార్థి సేన ఐక్యవేదిక అధ్యక్షుడు అజ్మీర బాలకోటి నాయక్, ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు శంకర్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్‌నాయక్, నరేష్, కిరణ్, రమేష్, ప్రకాష్‌నాయక్, వైష్ణవి, రాజు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం

రాంనగర్: టీపీసీసీ ఎస్టీసెల్ సెక్రటరీ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో శనివారం బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్‌చౌరస్తా వద్ద బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ప్రారంభించారు. రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుంచి శివంరోడ్, అయ్యప్ప స్వామి ఆలయం వీధి మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్; కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, కాంగ్రెస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్, నాయకులు రామ్మోహన్‌రావు, మహేందర్, హరి, అభిజిత్, రాంజీ, ఫుల్‌సింగ్; బాలు, నెహ్రూనాయక్, అబ్బు, రమేష్, కృష్ణ, మోత రోహిత్ తదితరులు పాల్గొన్నారు.


సేవాలాల్ జయంతి ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, వీరన్న నాయక్ తదితరులు


మాట్లాడుతున్న డాక్టర్ బీకే.శ్రీలత

మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి మంచి వ్యక్తిత్వాన్ని కలిగి క్రమశిక్షణను అలవర్చుకోవాలని ప్రముఖ హోమియోపతి ఫిజిషియన్ డాక్టర్ బీకే.శ్రీలత అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో సెల్ఫ్ ఎంపవర్‌మెంట్ ఫర్ సక్సెస్ అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వ్యక్తికి కష్టపడే తత్వం, విజయకాంక్ష భాష నైపుణ్యం కలిగి ఉండడం వల్ల జ్ఞాన సామర్థ్యానికి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, అధ్యాపకులకు, విద్యార్థులు పాల్గొన్నారు.